సాక్షి జోగుళాంబ గద్వాల

శుక్రవారం । 23 । మే । 2025



ఉత్సాహంగా పెద్ద కిస్తీలు

అలంపూర్ షాఅలీ పహిల్వాన్ ఉర్సులో భాగంగా కిస్తీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

వివరాలు 8లో ▸



భూ నిర్వాసితుల ఆందోళన

ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్వాసితులు బల్మూర్ పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.8 /23.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

గద్వాల: జిల్లాలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ జిల్లా అధికారి ప్రియాంక ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కర్నూల్, గద్వాల, అయిజలోని వివిధ కంపెనీలలో శిక్షణ, ఉపాధి కల్పించుటకు, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన 18–35 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

గద్వాల టౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 పరీక్ష కేంద్రాలలో మొదటిరోజైన గురువారం తెలుగు, సాంస్కృతం పరీక్షలు కొనసాగాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సర పరీక్షలో 700 మంది విద్యార్థులకుగాను 665 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 610 మంది విద్యార్థులకుగాను 585 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 90 మంది విద్యార్థులుకుగాను 80 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలో 148 మంది విద్యార్థులకుగాను 139 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా సమయం నిర్ణీత గడువుకు అరగంట ముందే విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి హృదయరాజు, ఇతర అధికారుల బృందాలు వేర్వేరుగా పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రవల్లి: బీచుపల్లి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఆయా సబ్జెక్టులలో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకుగాను అనుభవం గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పోస్టుల విషయానికి వస్తే.. తెలుగు పీజీటీ, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, బయోసైన్స్, అలాగే, మ్యాథ్స్ టీజీటీ, మ్యాథ్స్ జేఎల్, ఫిజిక్స్ జేఎల్, బోటనీ జేఎల్, జువాలజీ జేఎల్‌లో ఒక్కోటి పోస్టున పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 28 వరకు పాఠశాలలో తమ రెజ్యూమ్‌తో పాటు దరఖాస్తును సమర్పించాలని, పురుష అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, మరిన్ని వివరాలకు సెల్ నం.9866559671 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

సీడ్ పత్తి రైతులకు న్యాయం చేయాలి

గద్వాల: జిల్లాలో సీడ్ పత్తిని సాగుచేసే రైతులను కొందరు ఆర్గనైజర్లు నిలువునా మోసం చేస్తున్నారని ఆర్గనైజర్ల మోసాల నుంచి రైతులను కాపాడి వారికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కురువ విజయ్‌కుమార్ కలెక్టర్ బీఎం సంతోష్‌ను కోరారు. ఈమేరకు ఆయన గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీడ్ కంపెనీలు రైతులకు నేరుగా సీడ్‌పత్తి విత్తనాలు ఇవ్వకుండా ఆర్గనైజర్లు అనే దళారులను నియమించుకుని అమాయక రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తివిత్తనాలను ఆర్గనైజర్లు తమ స్వార్థానికి పాసైన విత్తనాలను సైతం ఫెయిల్ అయినట్లు అబద్ధాలు చెబుతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఫెయిలైన విత్తనాలకు సంబంధించి పూర్తి వివరాలను రైతులకు ఇవ్వకుండా దబాయిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్ననర్సింహులు, కృష్ణ, నర్సింహా, ఆంజనేయులు పాల్గొన్నారు.

సురక్షితమైన నీరు సరఫరా చేయాలి

గద్వాల: జిల్లాలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. భూగర్భ జలాలను పెంచేందుకు వర్షపునీటిని వడిసి పట్టుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రాబోవు వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే వివిధ రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీపీవో నాగేంద్రం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సిద్దప్ప, డీపీఓ సక్రియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● డెడ్‌లైన్.. డిసెంబర్

శరవేగంగా పాలమూరు..!

ఊపందుకున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు

- సీఎం ఆదేశాలతో అధికారుల ప్రత్యేక దృష్టి.. యుద్ధప్రాతిపదికన వర్క్స్
- 7 నెలల్లో నార్లాపూర్ నుంచి కర్వెన వరకు జలాశయాలు, కాల్వల నిర్మాణాలు పూర్తి
- 4 రిజర్వాయర్లలో మొత్తంగా 49 టీఎంసీల మేర నీటి నిల్వకు సన్నాహాలు
- ఈ ఏడాదిలోనే సాగు నీటి సరఫరా.. ఉమ్మడి జిల్లాలో 3 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- 2027 మార్చి వరకు ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తి
- కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ పనుల పూర్తికి కసరత్తు

ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంగా తలపెట్టిన సూదిని జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఎట్టకేలకు ఊపందుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించగా.. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లోపు నార్లపూర్ నుంచి కర్వెన వరకు (నార్లపూర్, ఏదుల, వట్టెం, కర్వెన) జలాశయాలు, కాల్వల నిర్మాణాలు, ఇతరత్రా పనులను పూర్తి చేసి.. సాగు నీరందించేలా పనుల్లో వేగం పెంచారు. అదేవిధంగా ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేసేలా ముందుకుసాగుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



పెద్దకొత్తపల్లి తీర్నాంపల్లి వద్ద కాల్వలో కొనసాగుతున్న బ్లాస్టింగ్ పనులు

ఉదండాపూర్‌లో జటిలంగా పరిహారం..

గ్రాండ్ రిపోర్ట్

పాలమూరులో భాగంగా చేపట్టిన కర్వెన రిజర్వాయర్ పనులు అన్నీ పూర్తయ్యాయి. అయితే కాల్వకు కీలకమైన వయాడక్ట్ ఏర్పాటులో భూసేకరణ సమస్యగా మారినట్లు తెలుస్తోంది. కేవలం రెండు ఎకరాల భూ సమస్య కోర్టులో పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇది ఓ కొలిక్కి వస్తే ప్రభుత్వం తాజాగా నిర్దేశించిన గడువు అంటే ఈ ఏడాది డిసెంబర్ వరకు అటు ఇటుగా కర్వెన జలాశయాన్ని నీటితో నింపి.. పంటలకు సాగు నీరందించే అవకాశం ఉంది. అదే విధంగా ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి భూసేకరణ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది. పరిహారం రూ.800 కోట్లు అవసరం ఉండగా.. ఇందులో రూ.72 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రిజర్వాయర్ నిర్మాణంలో భూమి కోల్పోతున్న వారు పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తుండడంతో సమస్య జటిలంగా మారింది. ఈ క్రమంలో ఈ రిజర్వాయర్ పూర్తికి ప్రభుత్వం 2027 మార్చి వరకు గడువు నిర్దేశించినట్లు సమాచారం.

మిగతా పెండింగ్ ప్రాజెక్ట్‌ల పూర్తికి డెడ్‌లైన్..

కృష్ణా పరివాహకంలోని ప్రాజెక్ట్‌ల స్థితిగతులపై ఇటీవల జలసౌధలో పలువురు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ఉదండాపూర్ జలాశయం వరకు మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని..18 నెలల్లో పెండింగ్ పనులను పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఈ ఏడాది డిసెంబర్‌లోపు మహాత్మాగాంధీ కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం.. వచ్చే ఏడాది జూన్‌లోపు కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనులు పూర్తి చేయించేలా సన్నాహాలు మొదలుపెట్టారు.

డిసెంబర్‌లో సాగు నీరందిస్తాం..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నిధుల సమస్య లేదని.. పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న పనులను ముమ్మరం చేశాం. డిసెంబర్‌లోపు నార్లాపూర్ నుంచి కర్వెన వరకు పనులు పూర్తి చేస్తాం. నాలుగు రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 48.94 టీఎంసీలు కాగా.. అన్నింటినీ నీటితో నింపుతాం. వీటి పరిధిలోని సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు డిసెంబర్ నుంచే సాగు నీరందించే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచాం.

– విజయభాస్కర్ రెడ్డి,
సీఈ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్

పాలమూరు ప్రాజెక్ట్‌కు సంబంధించి మొత్తం 18 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. ప్రస్తుతం నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్యాకేజీ-1, 5 , 8లో భాగంగా పంప్ హౌస్‌లలో మోటార్ల బిగింపు పూర్తయింది. నార్లాపూర్‌లో నాలుగు, ఏదుల, వట్టెంలో ఐదు చొప్పున మోటార్లు ఏర్పాటు చేశారు. నార్లాపూర్‌లో మరో రెండు మోటార్ల బిగింపు పనులు కొనసాగుతున్నాయి.

4 రిజర్వాయర్లు పూర్తి..

14 మోటార్లు సిద్ధం

ఇక్కడ రెండు మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా.. మిగతా వాటి పనులు జరుగుతున్నాయి. కాగా, గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వట్టెం పంప్ హౌస్ నీట మునగగా.. అప్పటి వరకు ఏర్పాటు చేసిన నాలుగు మోటార్లు దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతు చేయడంతోపాటు మరో మోటారు ఏర్పాటు చేశారు. మొత్తంగా నార్లాపూర్ నుంచి కర్వెన వరకు అంటే నాలుగు జలాశయాల వరకు నీటిని ఎత్తిపోసేలా.. ఆ రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసేలా అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు.



రిజర్వాయర్‌లో నీరు వచ్చేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ వివరాలు..

రిజర్వాయర్	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీలు)	ఆయకట్టు (ఎకరాలు)
నార్లాపూర్	6.50	-
ఏదుల	6.55	-
వట్టెం	16.74	1,39,000
కర్వెన	19.15	1,90,000
ఉదండాపూర్	16.03	4,88,000
కేపీ లక్ష్మీదేవిపల్లి	2.80	4,13,000



వట్టెం రిజర్వాయర్ పంపుహౌస్

ప్యాకేజీ 3, 7 పనులు ముమ్మరం..

ప్యాకేజీ-3లో భాగంగా నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు నీళ్లు తరలించేలా 8.325 కిలోమీటర్ల మేర కెనాల్ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో 4.825 కి.మీ.ల మేర తవ్వకం పనులు పూర్తి కాగా.. భారీ బండరాయి అడ్డు రావడంతో ఆటంకం ఏర్పడింది. కంట్రోల్ బ్లాస్టింగ్‌కు పెద్ద ఎత్తున నిధులు అవసరం కాగా.. నిర్మాణ సంస్థ జాప్యం చేస్తూ వచ్చింది. 3.5 కి.మీ.ల మేర తవ్వకం పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం పాలమూరు పనులపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఇటీవల ఎస్టిమేషన్ పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పనులు మళ్లీ ఊపందుకున్నాయి. అదేవిధంగా ప్యాకేజీ-7లో ఏదుల నుంచి వట్టెం వరకు 19 కి.మీ.ల మేర టన్నెల్ పనులు పూర్తయ్యాయి. ఏదుల నుంచి వట్టెంతో పాటు నార్లాపూర్ నుంచి ఏదుల వరకు పెండింగ్‌లో ఉన్న లైనింగ్ పనుల్లో ఇటీవల వేగం పెంచారు.



కుడికిళ్ల-తీర్నాంపల్లి సమీపంలో నూతనంగా చేపట్టిన కాల్వ తవ్వకాలు

‘నెట్టెంపాడు’ భూసేకరణ వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్, కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అదేవిధంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్, కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్టెంపాడు ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న 480ఎకరాల భూసేకరణపై వెంటనే చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా 99,100 ప్యాకేజీలలో సేకరించాల్సిన భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చింతరేవుల, శెట్టిఆత్మకూరు, మెలచెర్వు గ్రామాల్లో భూసేకరణపై రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్స్, కెనాల్స్, వారిగా తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని, భూసేకరణ పరిహారం చెల్లించిన వెంటనే అవసరమైన సివిల్ పనులు ప్రారంభించాలన్నారు. కాల్వల నిర్మాణం వల్ల గ్రామాల అభివృద్ధి, సాగు సౌకర్యాలు మెరుగవుతాయని, త్వరలోనే ప్రాజెక్టు పనులను పరిశీలిస్తానని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్‌ఈ రహీముద్దీన్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలి

గద్వాల: మావోయిస్టు జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావును పోలీసులు ఒడిశాలో అరెస్టు చేసి కాల్చిచంపారని, అనంతరం ఎన్‌కౌంటర్ కథ అల్లారని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గద్వాల పట్టణంలోని కృష్ణవేణిచౌరస్తాలో ప్లకార్డులతో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమానుషంగా పట్టుకొని చంపిన వారిలో అమాయక ఆదివాసి ప్రజలు, మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు ఉన్నారన్నారు. బుధవారం సాయంత్రం మావోయిస్టు జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావును నిరాయుధుడిగా పట్టుకొని పోలీసులు కాల్చిచంపారని ఆరోపించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అటవీ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టి వారిద్వారా ఇతర దేశాలకు తరలించడంలో భాగంగానే నరమేధం చేస్తున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరుతో నారాయణపూర్, దంతెవాడ, బీజాపూర్, కొండగావ్ జిల్లాలతో పాటు తెలంగాణలోని కర్రిగుట్ట అడవులలో జల్లెడపడుతూ మారణహోమానికి పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. ఓ పక్క మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినప్పటికీ శాంతిచర్చలు జరపకుండా కేంద్ర బలగాలతో ఏకపక్షంగా కాల్పులు జరిపి హత్యచేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఆపి శాంతిచర్చలు జరపాలన్నారు.నాయకులు కార్తీక్, దానయ్య, సుభాన్, నాగన్న, గోపాల్, ప్రేమ్‌కుమార్ అంజి, రంగస్వామి, సుధాకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు




ధాన్యం లోడింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ధాన్యం కొనుగోలులో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల మండలం చెనుగోనిపల్లి, గుంటిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తేమశాతం పరిశీలించి రైతులతో మాట్లాడుతూ.. ఏవైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో లోడింగ్, ఓపీఎంఎస్‌లో డేటా ఎంట్రీ తదితర అంశాలను పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కేంద్రాలలో ధాన్యం తడిసిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గన్నీబ్యాగుల కొరత, ట్రాన్స్‌పోర్ట్‌లో లారీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, సివిల్‌సప్లై డీఎం విమల, ఏడీఆర్‌డీఏ నర్సింహులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

దళితుల విద్యకోసం కృషి

దళితుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే కాకుండా వారికోసం పాఠశాలలు స్థాపించిన గొప్ప ఆదర్శమూర్తి భాగ్యరెడ్డివర్మ అని కలెక్టర్ బీఎం సంతోష్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించిన మహనీయుడు భాగ్యరెడ్డివర్మ అన్నారు. ప్రధానంగా దళిత బాలకలకు విద్యను అందించేందుకు పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అస్పృశ్యత, దేవదాసి వంటి అన్యాయాలను ఎదిరించి సమాజంలో మార్పు కోసం ఎంతగానో కృషి చేసినట్లు వివరించారు. ఈతరం యువత భాగ్యరెడ్డివర్మ చూపిన మార్గాన్ని అనుసరించి సమాజంలో మార్పు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, న ర్సింగ్‌రావు, ఆర్డీఓ శ్రీనివాసరావు, ఏవో నరెందర్, బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజ, వివిధ కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పవనపుత్రా.. పాహిమాం





ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, భక్తులతో రద్దీగా బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం

- బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంత్యుత్సవాలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఉదయం ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, వడమాల, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిదంగా వికాస తరంగిణి, విశ్వ హిందూపరిషత్, ధర్మప్రసార సమితి ఆధ్వర్యంలో చినజీయర్ స్వామి శిష్య బృందం సభ్యులు ఆలయంలో 1008 పర్యాయాలు హనుమాన్ చాలిసా పారాయణం చేశారు. హనుమంతుని గొప్పతనం, ధైర్య సాహసాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, హిందూ సంఘాల సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద దంపతులు గురువారం దర్శించుకున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రామన్‌గౌడ్ ఎమ్మెల్యే దంపతులను శేష వస్త్రాలతో సత్కరించగా.. అర్చకులు మారుతిచారి తీర్థ ప్రసాదాలు అందించారు. వారి వెంట నాయకులు విజయవర్ధన్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్రాములు, సురేందర్‌గౌడ్, రంజిత్‌కుమార్, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.


ప్రాజెక్టులకు నీటి ప్రవాహం

- జూరాలకు 8,953, శ్రీశైలానికి 8,940 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జూన్‌కు ముందే మొదలైన కొత్త నీటి రాక

గద్వాల/ ధరూరు/ దోమలపెంట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెండు ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెల చివరలోనే కొత్త నీటి రాక మొదలైంది. గురువారం ఎగువ ప్రాంతం నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 8,953, సుంకేసుల, హంద్రీ నుంచి శ్రీశైలం జలాశయానికి 8,940 క్యూసెక్కుల నీరు వచ్చింది. ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సాధారణంగా జూన్, జూలైలో కృష్ణానదికి వరదలు వస్తుంటాయి. జూరాల ప్రాజెక్టుకు కొన్ని నెలలుగా ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు దాపురించారు. మొన్నటి వరకు 3 టీఎంసీలకు పడిపోయిన నీటి మట్టం రెండు రోజులుగా వస్తున్న ఇన్‌ఫ్లోతో దాదాపు 1.25 టీఎంసీల నీరు చేరిందని అధికారులు చెప్పారు. డెడ్ స్టోరేజీ దశలో ఉన్న జూరాలకు స్థానికంగా కురుస్తున్న అకాల వర్షాలు కొంత మేలు చేశాయి. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.175 టీఎంసీల నీరు నిల్వ ఉందని పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసుల, హంద్రీ నుంచి..

శ్రీశైలం జలాశయానికి గురువారం సుంకేసుల నుంచి 8,690, హంద్రీ నుంచి 250 కలిపి మొత్తం 8,940 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చిందని జలాశయం గేజింగ్ నిర్వాహకులు తెలిపారు. కాగా.. గత 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఎగువన రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,305 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 817.2 అడుగుల వద్ద 38.8 టీఎంసీల నీటి నిల్వ ఉంది.



జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్

జూరాల స్టాప్‌లాక్ గేట్ల ఓవర్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టు గేట్ల మరమ్మతు ప్రక్రియ కొనసాగుతుండగా.. మరోవైపు రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జూరాలకు వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో గేట్ల మరమ్మతు చేసే క్రమంలో ప్రధాన గేట్లకు రక్షణగా ఉన్న స్టాప్‌లాక్ గేట్లపై నుంచి వర్షపు నీరు పొంగిపొర్లినట్లు ఎస్‌ఈ రహీముద్దీన్ తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తి ప్రాణం తీసిన చేపల వేట

వనపర్తి రూరల్: భీమా కాల్వలో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి కాళ్లకు వల చుట్టుకొని బోర్ల పడి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మునిస్వామి వివరాల ప్రకారం.. శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని తెలుగువాడకు చెందిన బొల్లెద్దుల ఆంజనేయులు(40) చేపలు పడుతూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం చేపలు పట్టడానికి గ్రామ శివారులోని భీమాకాల్వ దగ్గరకు వెళ్లాడు. కాల్వలోకి దిగి వల్ల విసురుతుండగా వల్ల కాళ్లకు చుట్టుకొని నీళ్లలో బోర్ల పడి మృతి చెందాడు. అతనికి మూర్ఛవ్యాధి ఉండడం వల్ల అప్పుడప్పుడు వస్తుండేది. అతడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి బొల్లెద్దుల పెద్ద బుచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రైలులో నుంచి పడి వ్యక్తి మృతి

రాజాపూర్: రైలులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (30) మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ వివరాల మేరకు.. రాజాపూర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ముళ్లపొదల్లో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రెండు రోజుల క్రితం వేగంగా ప్రయాణిస్తున్న రైలులో నుంచి జారిపడి మృతిచెంది ఉంటాడని.. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్, వైట్ చెక్స్ ఎర్రటి బనియన్ ఉన్నట్లు కానిస్టేబుల్ తెలిపారు. మహబూబ్‌నగర్ స్టేషన్ మాస్టర్ ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

రెండు లారీలు ఢీ : ఒకరి దుర్మరణం

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ పోతులమడుగ సమీపంలో సడెన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ లక్ష్మణ్ (23)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు (25) దుర్మరణం చెందాడు. సీఐ కమలాకర్ కథనం మేరకు.. గురువారం రాత్రి జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిని దాటుతున్న యువకుడిని హైదరాబాద్ వైపు నుంచి జడ్చర్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నదాతల అరిగోస

జడ్చర్ల మండలం కోల్‌బాయితండాకు చెందిన రైతు రాజు వంద బస్తాల ధాన్యాన్ని బాదేపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. 25 రోజులు అవుతున్నా కొనుగోలు చేయలేదు. ప్రతిరోజు ఆరబెట్టడం, కుప్ప గట్టడంతోనే సరిపోతోంది. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తి కుప్ప వద్దే పైరుగా మారింది. ఇలా రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడం తలకు మించిన భారంగా మారడంతో ఆందోళన చెందుతున్నారు.



జడ్చర్ల పత్తి మార్కెట్ కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి నిల్వ ఉన్న ధాన్యం కుప్పలు

- అకాల వర్షాలతో రైతన్నలు ఆగమాగం
- కుప్పల వద్దే మొలకెత్తుతున్న ధాన్యం
- కొనుగోలులో అధికారుల మీనమేషాలు
- రేయింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు
- జాతీయ రహదారి–167పై బైఠాయింపు

జడ్చర్ల: అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఆరుగాలం అష్టకష్టాలు పడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే దిక్కులేకపోవడంతో కుప్పల వద్దే రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం దిగుబడులు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ధాన్యం కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలు, ప్రధాన రహదారులు, ఖాళీ స్థలాల్లో నిల్వ చేసిన ధాన్యం కుప్పల వద్దే రోజుల తరబడి రైతులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. అమ్ముకోవడానికి నానా యాతన పడుతున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో సహకార సంఘాలతోపాటు ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బోనస్ దేవుడెరుగు..

రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు ఎక్కువగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే ఆశ్రయిస్తున్నారు. అయితే కొనుగోలులో జరుగుతున్న జాప్యం తదితర ఇబ్బందులతో బోనస్ మాట దేవుడెరుగు గాని తాము అంతకంటే ఎక్కువగా నష్టపోయే పరిస్థితి దాపురించిందని ఆందోళన చెందుతున్నారు.

తూకాల్లో కటింగ్..

ధాన్యం తూకం వేసే సమయంలో క్వింటాల్‌కు కిలో వరకు తరుగు తీయడంతోపాటు మిల్లులకు తరలించిన సమయంలో క్వింటాల్‌కు మరో 2, 3 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అంతేగాక ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లుల నిర్వాహకులు నిరాకరిస్తున్నారంటున్నారు. ఇక రవాణా, తూర్పారబట్టడం, కుప్పలు పోయడం, ఆరబెట్టడం, హమాలీ తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆరోపిస్తున్నారు. క్వింటాల్‌కు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నా ఆయా ఖర్చులు, తరుగు లెక్కిస్తే బయటి మార్కెట్‌లో లభిస్తున్న ధరలే గిట్టుబాటవుతున్నాయని పేర్కొంటున్నారు.

తేమ శాతంతో కొర్రీలు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తేమ శాతం ఎక్కువగా ఉండటం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. పంట కోత సమయంలో దాదాపు 30 శాతం పైగా ఉన్న తేమను తగ్గించేందుకు రైతులు ధాన్యాన్ని రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టడం, శుద్ధి చేయడం చేస్తున్నారు. అయితే అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతోంది. ఫలితంగా ధాన్యాన్ని నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రోజుల తరబడి పొలం పనులు మానుకొని ధాన్యం ఆరబెట్టడమే సరిపోతోందని వాపోతున్నారు. కొందరు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల వద్ద తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారని, డబ్బులు ముట్టజెప్పితేనే టోకెన్లు జారీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



జాతీయ రహదారి–167పై ఆందోళన చేస్తున్న రైతులు

జాతీయ రహదారిపై ఆందోళన

జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డు ఎదుట జాతీయ రహదారి–167పై రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ధాన్యాన్ని రోడ్డుపై పోసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో సివిల్ సప్లయ్ డీఎం రవినాయక్ అక్కడికి చేరుకుని విచారించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తదుపరి 6 వేల బస్తాలకు సంబంధించి రైతులకు టోకెన్లు జారీ చేసి కొనుగోళ్లు వేగవంతం చేశారు.

కుప్ప వద్దే ఉంటున్నాం..



జడ్చర్ల పత్తి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్ప వద్దే 22 రోజులుగా పడిగాపులు కాస్తున్నాను. పనులు మానుకుని ఉన్నా టోకెన్ ఇవ్వలేదు. 5 రోజుల కిందట గన్నీ బ్యాగులు ఇచ్చారు. కానీ, తూకాలు వేయడం లేదు. వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిపోతుంది.

– యాదయ్య, రైతు, చిన్నపల్లి

పట్టించుకోవడం లేదు..



ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాం. ధాన్యం ఆరబెట్టడం, కుప్పగట్టడం, తూర్పారబట్టడం వంటివి ఇబ్బందికరంగా మారాయి. 15 రోజులుగా కుప్ప వద్దే ఉన్నాను. వర్షానికి తడిసి పోతున్నా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలి.

– విశ్వనాయక్, రైతు, గొల్లపల్లి

ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు..

ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. రోడ్లు, పొలాలు, మార్కెట్ ఆవరణ, ఇతర మైదాన ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. కొందరైతే ఇబ్బందులు భరించలేక ఎంతకో అంత అన్నట్లుగా బాదేపల్లి యార్డుకు తరలించి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో బాదేపల్లి మార్కెట్‌లో ఇప్పటి వరకు దాదాపు లక్ష బస్తాలకు పైగా ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్మారు. మరోవైపు అకాల వర్షాలు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడం ఆకస్మికంగా వర్షం రావడంతో కుప్పగట్టడం వంటి పనులు చేసేందుకు కుటుంబ సభ్యులంతా ధాన్యం కుప్పల వద్దే ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు.



రైతులకు టోకెన్లు జారీ చేస్తున్న సివిల్ సప్లయ్ డీఎం రవినాయక్

ఉత్సాహంగా పెద్ద కిస్తీలు



పెద్ద కిస్తీల్లో పాల్గొన్న పహిల్వాన్‌లు

ప్రసాదం కోసం పహిల్వాన్‌ల విన్యాసాలు

అలంపూర్: పట్టణంలో హజరత్ షాఅలీ పహిల్వాన్ ఉర్సులో భాగంగా గురువారం పెద్ద కిస్తీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. షాఅలీ పహిల్వాన్ ధడ్ ముబారక్ దర్గా వద్ద జరిగిన కిస్తీ పోటీల్లో వందలాది భక్తుల మధ్య తబురుక్ (ప్రసాదం) కోసం పహిల్వాన్‌లు తలపడ్డారు. కిస్తీలో వేసిన ప్రసాదాన్ని భక్తుల పైకి విసురుతూ ఉర్సు ప్రాధాన్యతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా అబ్బుర పరిచే విన్యాసాలతో భక్తులను అలరించారు. ముందుగా కిస్తీ పోటీలను దర్గా అభివృద్ధి కమిటీ చైర్మన్ సయ్యద్ అహ్మద్ షా ఓవైసీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయుడు దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కిస్తీ పోటీల వద్దకు చేరుకొని తిలకించారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్ మంజుల, ఎస్ఐ వెంకటస్వామిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం సయ్యద్ ఖాదర్ బాషా ఇంటి నుంచి వచ్చిన సర్కారీ కిస్తీని ఊరేగింపుగా దర్గాల వద్దకు తీసుకొచ్చారు. అక్కడ నిర్వాహక కమిటీ సభ్యులు సర్కారీ కిస్తీని సిద్ధం చేశారు. మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే కిస్తీ పోటీలను ప్రారంభించారు. పెద్ద కిస్తీల సందర్భంగా సీఐ రవిబాబు, ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో 70 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

ఊరేగింపుగా కిస్తీలకు ప్రసాదం..

షా అలీ పహిల్వాన్ దర్గాలో పెద్ద కిస్తీ పోటీల కోసం తెచ్చే ప్రసాదాన్ని భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ఆయా కాలనీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కిస్తీ పోటీలకు ప్రసాదం అందించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉర్సుకు తరలివచ్చిన భక్తజనంతో ప్రధాన వీధులు సందడిగా మారాయి.



సర్కారీ కిస్తీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



పహిల్వాన్‌ల విన్యాసాలు

ఎస్‌వీఎస్‌లో రోబోటిక్ సర్జరీ సేవలు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవల్లో ఒకటైన రోబోటిక్ జాయింట్ నీ–రీప్లేస్‌మెంట్ సర్జరీలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే రెడ్డి వెల్లడించారు. గురువారం ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై రాబోయే రోజుల్లో అనుభవంతో కూడిన రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు చేయనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఈ చికిత్స ఎంతో అవసరమన్నారు. ఎస్‌వీఎస్‌లో ఇప్పటి వరకు 500 నీ–రీప్లేస్‌మెంట్ సర్జరీలు చేశామని.. ఇప్పుడు మొదటిసారి రోబోటిక్ సర్జరీ చేయడం జరిగిందన్నారు. ఇకపై అధిక ఖర్చులు చేసి హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా స్థానికంగానే ఇలాంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. రోబోటిక్ సర్జరీల్లో ఇన్ఫెక్షన్ శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఎస్‌వీఎస్‌లో ఇలాంటి అధునాతన వైద్యంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఇలాంటి సర్జరీలు చేయడానికి యువ వైద్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు సర్జరీలు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. అన్ని రకాల ఇన్సూరెన్స్ గ్రూప్స్, ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీ–జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలో సర్జరీతో పాటు ఆ తర్వాత తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన ఉండటం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కేజే రెడ్డి

గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

మహబూబ్‌నగర్ క్రైం: గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి ఓ మెస్‌తో పాటు కిరాణ దుకాణం దగ్ధమైంది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి మల్లికార్జున్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఓ మెస్‌లో ఉదయం 11:30 ప్రాంతంలో భోజనం తయారు చేస్తున్న క్రమంలో సిలిండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగాయి. మెస్‌లో నుంచి పక్కనే ఉన్న కిరాణ దుకాణంలోకి మంటలు వ్యాపించడంతో కిరాణ వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో దాదాపు రూ. 5లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు ఫైర్ ఆఫీసర్ వెల్లడించారు.



దగ్ధమైన కిరాణ దుకాణం

చిరుత దాడిలో లేగదూడ హతం



చిరుత దాడిలో మృతిచెందిన లేగదూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కోయిల్‌కొండ: లేగదూడపై చిరుత దాడిచేసి హతమార్చిన ఘటన కోయిల్‌కొండ మండలం ఇబ్రహీంనగర్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఇబ్రహీంనగర్‌కు చెందిన రైతు బోయిని ఆనంద్ గ్రామ సమీపంలోని కుక్కలగుట్ట వద్దనున్న తన పొలంలో రోజు మాదిరిగానే బుధవారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో పశువుల పాకపై చిరుత దాడిచేసి ఓ లేగదూడను ఎత్తుకెళ్లి హతమార్చింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. బాధిత రైతును ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పోలీస్‌స్టేషన్ వద్ద భూ నిర్వాసితుల ఆందోళన

బల్మూర్: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన ఉమామహేశ్వర రిజర్వాయర్ భూ నిర్వాసితుడు గంట కృష్ణయ్యను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అతడి అక్రమ అరెస్టును నిరసిస్తూ భూ నిర్వాసితులు పెద్దఎత్తున స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బల్మూర్ సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్ భూ సేకరణ కోసం ఈ నెల 24న గ్రామసభ నిర్వహించనున్నారు. అయితే భూ సేకరణకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి గంట కృష్ణయ్య తోటి నిర్వాసిత రైతుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్ సేకరిస్తుండగా.. పోలీసులు ఎలాంటి సమాచారం లేకుండా అతడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహానికి గురైన భూ నిర్వాసితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నిర్వాసిత రైతును అక్రమంగా నిర్బంధించడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. తమ హక్కులను కాపాడుకోవాలనే ప్రయత్నాన్ని పోలీసులతో అడ్డుకోవాలని ప్రభుత్వం కుట్ర పన్నుతుందని వారు మండిపడ్డారు. భూ నిర్వాసితులందరికీ న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కాగా, ఈ విషయమై ఎస్ఐ రమాదేవిని వివరణ కోరగా.. ఈ నెల 24న జరిగే భూ సేకరణ గ్రామసభలో తోటి రైతులతో కలిసి ఘర్షణకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు అతడిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని బేషరతుగా వదిలిపెట్టడం జరిగిందని తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో భూ పోరాట సమితి నాయకులు రఘుమారెడ్డి, నాగయ్య, సీతారాంరెడ్డి, శివశంకర్, తిరుపతయ్య, ఇంద్రారెడ్డి, ఆయా గ్రామాల భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.



బల్మూర్ పోలీస్‌స్టేషన్ వద్ద భూ నిర్వాసితులు

రమాదేవికి జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణానికి చెందిన పరిశోధక విద్యార్థి రమాదేవికి జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు దక్కింది. జీవ వైవిధ్య మండలి చరిత్రలో అవార్డు పొందిన తొలి మహిళగా రికార్డును సొంతం చేసుకున్నారు ఆమె. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లోని బిర్లా మ్యూజియం భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి రమాదేవికి అవార్డును బహూకరించింది. స్థానిక ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తిచేసిన రమాదేవి.. అధ్యాపకుడు డా.సదాశివయ్య పర్యవేక్షణలో పరిశోధనలు ప్రారంభించారు. బొటానికల్ గార్డెన్‌లో అనేక రకాల మొక్కలు నాటడంతో పాటు అడవుల్లో పరిశోధనలు చేయడంతో పాటు సర్ప రక్షణలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. దీంతో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి అవార్డును రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి డా.సువర్ణ, జీవ వైవిధ్య మండలి ప్రధాన కార్యదర్శి కాళీచరణ్ ప్రదానం చేశారు. రమాదేవికి అవార్డు దక్కడంపై బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న రమాదేవి

భాస్కర్ కుటుంబానికి కన్నీటి వీడ్కోలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

గద్వాల క్రైం: కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లా మనగులి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు భాస్కర్ (41), అతడి భార్య పవిత్ర (38), కుమారుడు అభిరాం (7), కుమార్తె జ్యోత్స్న (9) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన విదితమే. గురువారం వారి మృతదేహాలను కర్ణాటక నుంచి స్థానిక బీసీ కాలనీలోని తమ నివాసానికి కుటుంబ సభ్యులు తీసుకురావడంతో బంధువులు, కాలనీ వాసుల రోదనలు మిన్నంటాయి. మృతుల బంధువులు గుండెలు బాదుకుంటూ రోదించారు. వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నించే వారే లేకపోయ్యారు. ప్రమాదంలోంచి బయటపడిన భాస్కర్ చిన్నకుమారుడు ప్రవీణ్‌తేజ్ అమ్మానాన్న, అక్క, అన్నయ్య ఎక్కడ ఉన్నారంటూ కంటతడి పెట్టాడు. జరిగిన ప్రమాదంపై ప్రవీణ్‌తేజ్ తేరుకునే పరిస్థితి లేకపోయింది. మృతుల చివరి చూపుకోసం బంధువులు, స్నేహితులు, కాలనీ వాసులు పెద్దఎత్తున చేరుకున్నారు. అశ్రునయనాల మధ్య వారి అంత్యక్రియలు నిర్వహించారు.

- భాస్కర్ కుటుంబ సభ్యుల పార్థివదేహాలకు వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని.. అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, మోహన్‌రెడ్డి, హన్మంతు, ఆంజనేయులు, వెంకటస్వామి, నర్సింహ తదితరులు ఉన్నారు.

కాపురానికి సహకరించడం లేదని.. కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్త

- నవవధువు మృతి కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.లింగయ్య

మద్దూరు: కొత్తపల్లి మండలం ఎక్కమేడ్ గ్రామంలో నవవధువు అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. కాపురానికి సహకరించడం లేదని కట్టుకున్న భర్తే నవవధువును హతమార్చాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను నారాయణపేట డీఎస్పీ ఎన్.లింగయ్య వెల్లడించారు. వివరాలిలా.. కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌కు చెందిన కడపని స్వామితో కొయిల్‌కొండ మండలం మల్కాపూర్‌కు చెందిన పూజ(19)తో గతనెల 20న వివాహం జరిగింది. పెళ్లయిన తర్వాత తల్లిగారింటికి వెళ్లిన పూజ.. అక్కడే 10 రోజుల పాటు ఉండి, ఈ నెల 14న అత్తగారింటికి వచ్చింది. 18న రాత్రి భర్త కడపని స్వామి పూజతో శారీరకంగా కలవడానికి ప్రయత్నించగా.. ఆమె నిరాకరించింది. తల్లిగారింటి నుంచి వచ్చినప్పటి నుంచి తనతో కలవడానికి నిరాకరిస్తుందని.. ఆమెకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందేమోనని అనుమానం పెంచుకున్నాడు. తనతో ఉంటే ఇక సుఖం ఉండదని.. ఆమెను చంపి మరొకరిని వివాహం చేసుకోవాలని భావించాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి పూజ గొంతు నుమిలి హతమార్చాడు. మృతురాలి తండ్రి గుర్రాల కుశలయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతదేహానికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అయితే డాక్టర్ ఇచ్చిన నివేదిక ప్రకారం కేసును హత్యానేరం కింద మార్చి.. కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. కడపని స్వామిని పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

■ " Independent House For Sale " East Facing, 2BHK, 185 sqyd at Jedcharla Mob : 9886154400

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. 9389214214

FOR SALE

■ AVYUKTH FARMS పంచవటి Hotel రోడ్ బూత్ పూర్, బెరస జాతి (పందెపు కోళ్లు) నాటు కోడి పిల్లలు, నాటు కోళ్లు అమ్మబడును. 9848542218

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే

HAPPY BIRTHDAY

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల ఆధారంగా పాఠకులు ... – సాక్షి మేనేజ్‌మెంట్